క్లుప్తంగా

రాజ్యసభ ఎంపీ బాబూరావుకు ఘన స్వాగతం



రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావుకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం : ఢిల్లీ రాజ్యసభ సమావేశాల్లో తొలిసారిగా గళం విప్పి ఉమ్మడి విశాఖ జిల్లాకు తిరిగి వచ్చిన రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావుకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విశాఖ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎంపీ అయిన బాబురావు గ్రామీణ ప్రాంతం సమస్యలు రాజసభలో ప్రస్తావించారని కొనియాడారు. ఎంపీ బాబూరావుకు స్వాగతం పలికిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, శ్రీపతిరాజు, మామిడి చంటి, మాజీ జెడ్పీటీసీ కొంకోట నీలేంద్రరావు,కోరెడ్డి బాబి ఉన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ తల్లి పండగ



ఉమ్మలాడలోని దుర్గాలమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: ఉమ్మలాడ గ్రామంలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు విజయకుమార్‌కు శాలువా కప్పి సత్కరించారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



మూలపేట గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో నూతనంగా నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి భక్తులు తమ వంతు సాయం అందజేస్తూ దైవభక్తిని చాటుకుంటున్నారు. గురువారం గంగాదేవిపేటకు చెందిన స్వర్గీయ మొల్లేటి అప్పారావు జ్ఞాపకార్థం భార్య వెంకటలక్ష్మి, కుటుంబ సభ్యులు రూ.20,116 విరాళంగా అందజేశారు. సర్పంచ్ గంగప్పల నాయుడు, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు,కాంద్రేగుల శ్రీనివాసరావు, యల్లపు నాగేశ్వరరావు,కాంద్రేగుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీఆర్‌వన్ యాప్‌పై అవగాహన



పీఆర్ వన్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట : మండల పరిషత్ కార్యాలయంలో పి.ఆర్.వన్ యాప్ పై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. గ్రామాల్లో నామినేషన్ క్వాలిటీ వాటర్ స్టాక్ డీటెయిల్స్ వాటిపై కూడా శిక్షణ నిర్వహించడం జరిగిందన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు ర్యాబిస్ నిరోధక టీకాలు

అనకాపల్లి : స్థానిక గాంధీనగరం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జునోసిస్ డే సందర్భంగా శుక్రవారం పెంపుడు కుక్కలకు ఉదయం 9 గంటల నుంచి ఉచితంగా ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

అనకాపల్లి : స్థానిక గవరపాలెంలో 18 మద్యం క్వార్టర్ బాటిల్స్ తరలిస్తున్న వై.గోపి గణేష్‌పై పోలీస్‌లు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ శంకరరావు కథనం మేరకు గవరపాలెంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గోపి గణేష్ మద్యం క్వార్టర్ బాటిల్స్ తరలిస్తూ పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

మహోజ్వల శక్తి...పోరాట స్ఫూర్తి అల్లూరి



కోటవురట్లలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మండల పరిషత్ సిబ్బంది



తిమ్మరాజుపేటలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో మన్మథరావు



పాయకరావుపేట ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి జయంతి కార్యక్రమం



నక్కపల్లిలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



చిన దొడ్డిగల్లులో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కోటవురట్ల : విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజుకు వాడవాడలా ఘన నివాళి అర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల గుండెల్లో వణుకు పుట్టించిన మన్యం వీరుడు అల్లూరి అన్నారు. ఆ మహనీయుని ఆశయం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. అల్లూరి జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్య్ర ఉద్యమానికి ఊపిరిపోసి దేశ ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. పరిపాలనాధికారి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. కె.వెంకటాపురంలోని జెడ్పీహైస్కూల్‌లో హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అల్లూరికి ఘన నివాళి అర్పించారు.

మునగపాక: అల్లూరి జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.మన్మథరావు ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల హక్కులకోసం అల్లూరి ఎంతో కృషి చేశారని, బ్రిటిష్ పాలకులను తరిమికొట్టిన అల్లూరి నేటి తరానికి ఆదర్శం కావాలని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు. తిమ్మరాజుపేటలో అల్లూరి విగ్రహానికి బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. బీవీ రమణ, సూరిశెట్టి రాము, నరసింగరావు, వెంకటప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మూలపేటలో బీజేపీ మండల అధ్యక్షులు యల్లపు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అల్లూరి జయంతి కార్యక్రమం నిర్వహించారు.

పాయకరావుపేట : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.స్వప్న ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ సిహెచ్.వర్మ, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాలి

నక్కపల్లి : దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాల సాధన కోసం పాటు పడాలని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ అన్నారు. మన్యం వీరుడు అల్లూరి 127వ జయంతిని గురువారం క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి ఒక మహోజ్వల శక్తి అని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో అల్లూరి పోరాటం ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోయిందన్నారు. గిరిజనులు, పీడిత వర్గాల ఆశాజ్యోతిగా సీతారామరాజు చేసిన పోరాటాలు ఇప్పటికీ వారి గుండెల్లో పదిలంగా ఉన్నాయన్నారు. చినదొడ్డిగల్లు పాఠశాలల్లో స్వాతంత్ర్యోద్యమంలో అల్లూరి పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన , చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ వ్యవస్థాపకుడు వెంకరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ అయినంపూడి మణిరాజు, సర్పంచ్ చినపేర్రాజు, క్షత్రియ పరిషత్ నాయకులు, అప్పలరాజు, మీగడ సత్తిబాబు, కోసూరు శ్రీను, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తి అల్లూరి

యలమంచిలి : స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి పాత్ర మరువలేనిదని తహసీల్దారు అప్పలరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని గురువారం యలమంచిలి తహసీల్దారు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారితో పోరాడి ధైర్యంగా ఎదుర్కొన్న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ప్రజల మనస్సుల్లో చిర స్థాయిగా నిలిచిపోయారని ఆయన త్యాగఫలమే ఈనాటి స్వాతంత్ర్య ఫలాలు అని అన్నారు.

ఎస్.రాయవరం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అల్లూరి జయంతి నిర్వహించారు. తహసీల్దార్ జయలక్ష్మి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అల్లూరి త్యాగాన్ని కొనియాడారు. గుడివాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేరిచర్ల శ్రీపతిరాజు, గుర్రాజుపేట శివారు రాజా వెంకటనగరంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి శ్రీ వెంకటపతిరాజు ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయులు అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు, మండల అధ్యక్షుడు జి. సునీల్, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు , మండల వీఆర్వో సంఘ అధ్యక్షుడు నూకరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వర్మ, గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనుబాబు క్షత్రియ సంఘ యూత్ పాల్గొన్నారు.



యలమంచిలి : అల్లూరి జయంతి కార్యక్రమంలో తహసీల్దారు అప్పలరాజు, సిబ్బంది



ఎస్.రాయవరం : తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ జయలక్ష్మి



ఎస్.రాయవరం : గుడివాడలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎస్.రాయవరం : రాజా వెంకటనగరంలో ఉపాధ్యాయ సంఘ నాయకుల ఆధ్వర్యంలో అల్లూరి జయంతి

జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తం



కోటవురట్ల కేజీబీవీలో జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రతాప్‌కుమార్

కోటవురట్ల : జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టరు ప్రతాప్‌కుమార్ అన్నారు. స్థానిక కేజీబీవీలో ఈ నెల 6న నిర్వహించనున్న వరల్డ్ జూనోసిస్ డే పై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల్లో రాబిస్, ఎబోలా, స్వైన్‌ఫ్లూ, జికా, ప్లేగూ, డెంగ్యూ ప్రధానమైనవన్నారు. ఈ వ్యాధులు జంతువుల నుంచి బాక్టీరియా ద్వారా మనుషులకు సోకుతుందన్నారు. ఇంట్లో పెంపుడు కుక్కల ద్వారా రాబిస్ వ్యాధి సోకుతుందని, ముందుగా యాంటీ రాబిస్ టీకా వేయడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చన్నారు. జీవ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ టీకా మొదటి మోతాదును 1885 జూలై 6 అందించారని, అందుకే అదే రోజున వరల్డ్ జూనోసిస్ డే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీన పశు సంవర్ధక శాఖ కార్యాలయం వద్ద పెంపుడు జంతువులకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామారావు, శ్రీజోష్, ఉపాధ్యాయులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే పదవులు అనవసరం



మండల సాధారణ సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

యలమంచిలి : ప్రజా సమస్యలు పరిష్కరించలేకపోతే ప్రజాప్రతినిధులగా కొనసాగడం అనవసరం అని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం జరిగిన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో అన్నారు. యలమంచిలి మండల పరిషత్ సాధారణ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువా జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన సమావేశం ప్రారంభించి పలు అంశాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రీ సర్వేలో తప్పులు దొర్లి తన 66 సెంట్ల భూమిని ఆన్‌లైన్ రికార్డుల్లో 2 సెంట్లుగా చూపిస్తుందని పులపర్తి కోఆప్షన్ సభ్యుడు నూకేశ్వరరావు, పోతిరెడ్డిపాలెం సర్పంచ్ ఇత్తంశెట్టి సత్యనారాయణ తన మూడెకరాల పొలంకు సంబంధించి రీ సర్వేలో తప్పుల కారణంగా తక్కువగా రికార్డుల్లో చూపిస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మండల సర్వేయర్‌ను ప్రశ్నించడంతో సమాధానం రాకపోవడంతో సర్వేయర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహసీల్దారు అప్పలరాజును ఎమ్మెల్యే ఆదేశించారు. మండలంలో గంజాయికి యువత ఎక్కువగా బానిసలుగా మారి హత్యలు, దొంగతనాలకు పాల్పడుతున్నారని అటువంటి వారిపై గట్టి చర్యలతో పాటు మానసిక పరివర్తన కలిగేలా యలమంచిలి నియోజకవర్గంలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామనన్నారు. లైను కొత్తూరు, రేగుపాలెం గ్రామాల్లో పోలవరం కాలువ గట్లు తవ్వి మట్టిని, ఆగ్రిగోల్డ్ ప్రైవేట్ భూముల్లో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోలేదేమని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నీటి వనరులు వృధా కాకుండా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. గూండ్రుబిల్లి గ్రామంలో రోడ్లు, డ్రైయినేజీ, శ్మశాన వాటికపై దృష్టి సారిస్తానని సర్పంచ్‌కు తెలిపారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలు మధ్యలో ఆగిపోయిన ఇళ్లను గుర్తించి నిజమైన లబ్ధిదారులకు ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, వైస్ ఎంపీపీ రాజాన శేషు, శిలపరశెట్టి ఉమ, తహసీల్దారు అప్పలరాజు, ఎంపీడీవో అప్పలనాయుడు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ర్యాలీ, సదస్సు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం అక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డయేరియా నివారణ, కీటక జనిత వ్యాధులపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. తరణి ఐదేళ్లలోపు పిల్లలు అతిసార వ్యాధికి గురయ్యే అవకాశం ఉందని, వారి పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. విరోచనాలు అయినప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తరచుగా పిల్లలకు ఇవ్వాలన్నారు. సమీపంలోని ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. దోమలు కుట్టకుండా తెరలు వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది బృందంగా ఎస్సీ, బీసీ కాలనీల్లో పర్యటించి జ్వర పీడితులను గుర్తించి వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, సీహెచ్‌వో కె. అరుణ, ఏఎన్ఎం ఎన్. సత్యదేవి, ఆరోగ్య కార్యకర్త ఆర్‌వీవీ సత్యనారాయణ, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారిక వెబ్‌సైట్ ద్వారానే విద్యుత్ బిల్లులు చెల్లించాలి

కశింకోట : విద్యుత్ వినియోగదారులు ఈస్ట్రన్ పవర్ యాప్, అధికారిక వెబ్‌సైట్ www. apeasternpower.com ద్వారా విద్యుత్ బిల్లులను నేరుగా చెల్లించుకోవచ్చని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు గూగుల్ పే, ఫోన్ పే, ఇతర యూపీఐ యాప్స్ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం వినియోగదారులకు లేదన్నారు. దీని దృష్ట్యా ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్ ద్వారా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే యాప్‌లతో పాటు డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ వినియోగించి విద్యుత్ ఛార్జిలను చెల్లించవచ్చన్నారు.

రంగా సేవలు చిరస్మరణీయం



నక్కపల్లిలో రంగాకు నివాళులర్పిస్తున్న దృశ్యం



పాయకరావుపేటలో వంగవీటి రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాపు నాయకులు



కోటవురట్ల- నర్సీపట్నం మెయిన్‌రోడ్డులో నిరాశ్రయులకు ఆహారాన్ని అందిస్తున్న యువకులు

నక్కపల్లి : కాపు నేత వంగవీటి మోహన్ రంగా జయంతిని గురువారం నక్కపల్లిలో అఖిలపక్ష నేతలు ఘనంగా నిర్వహించారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రంగా చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి రంగా అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. కాపు సామాజిక వర్గం సంక్షేమం కోసం పాటు పడిన రంగా అడుగు జాడల్లో నడవాలని అన్నారు. నక్కపల్లి, ఉపమాక, ఉద్దండపురం, రమణయ్యపేట గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో కాపు నేతలు వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేష్, మీగడ సత్తిబాబు, ముద్దా శ్రీను, కొప్పిశెట్టిబుజ్జి, నూకతాత, రవి పాల్గొన్నారు.

పాయకరావుపేట : కాపునాడు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వంగవీటి రంగా 77వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో గల జీవీఆర్ నగర్ వద్ద, అరట్లకోట గ్రామంలోను వున్న రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళిలర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు ముఖ్య నాయకులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, దగ్గపల్లి సాయిబాబా, యాళ్ళ వరహాలు పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలో వంగవీటి మోహనరంగా 77వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పేటకు చెందిన యువకులు రంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

కోటవురట్ల నుంచి నర్సీపట్నం వరకు మెయిన్‌రోడ్డులో ర్యాలీ చేసి అనాథలు, బిచ్చగాళ్లు, నిరాశ్రయులు, పెదబొడ్డేపల్లిలోని నిరాశ్రయ గృహంలోని పేదలకు ఆహారాన్ని అందించారు. పండ్లు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

నక్కపల్లి : మండలంలో పాటిమీద గ్రామంలో ఉన్న కాంద్రకోట నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమలాపురం, పాటిమీద, మూలపర, తమ్మయ్యపేట గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, వెలగా ఈశ్వరరావు, సూరాకాసుల గోవిందు, గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్, కొప్పిశెట్టి హరి, రోళ్ల శ్రీను ఉన్నారు.

జగన్నాథస్వామి ఉత్సవ కమిటీ నియామకం

అనకాపల్లి : స్థానిక గూడ్స్ రోడ్డు సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి నూతన ఉత్సవ కమిటీని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం నియమించారు. కమిటీ సభ్యులుగా దాడి వీఎస్ నారాయణ, బొండా రాజేష్, బి.కోటేశ్వరరావు, అనకాపల్లి మోహన్‌రావు, వై.ధనలక్ష్మి, బి.వెంటక చలపతిరావు, బి.లక్ష్మీ అప్పారావులను నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నీట్ పరీక్ష అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

పట్టణంలో విద్యాసంస్థల బంద్



నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు



రేవుపోలవరంలో విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న దృశ్యం

యలమంచిలి రూరల్: నీట్ ప్రవేశ పరీక్షలో అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కంటితుడుపు చర్యలు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష అక్రమాలకి నిరసనగా దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా గురువారం విద్యార్థి సంఘాల నేతృత్వంలో పట్టణంలో ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు,కళాశాలల్లో బంద్ పాటించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ,ఏఐఎస్ఎఫ్ నాయకులు,విద్యార్థులు పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. నీట్ పరీక్ష అక్రమాలకు సంబంధించి వైఫల్యం చెందిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని కోరారు. అనేక పరీక్షల నిర్వహణలో ఎన్‌టీఏ విఫలమౌతోందని విమర్శించారు. విద్యార్థులకు న్యాయం చేయాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం బాలాజీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు జగదీష్ ప్రసాద్, కార్తీక్, దుర్గారావు, ప్రసాద్, ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు మణికంఠ రవి సింహాద్రి, రాజేష్,కృప తాతాజీ,ఉపాధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

మండలంలో పాక్షికంగా బంద్

ఎస్.రాయవరం : మండలంలో ఎస్ఎఫ్ఐ చేపట్టిన విద్యా సంస్థల బంద్ పాక్షికంగా జరిగింది. ఎస్ఎఫ్ఐ మండల బాధ్యులు అప్పలరాజు ఆధ్వర్యంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రయివేటు పాఠశాలలు మూయించి విద్యార్థులను ఇళ్లకు పంపారు. ఈ సందర్భంగా అప్పలరాజు, వై.సురేష్ మాట్లాడుతూ అసమర్థ ఎన్‌టీఏ రద్దు చేయాలని, నేషనల్ టెస్ట్ ఏజెన్సీ వల్ల నీట్ పరీక్ష కాకుండా ఇతర పరీక్షలు కూడా లీకేజీ అవుతున్నాయన్నారు. ఇటీవల నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఎస్ఎఫ్ఐ డివిజన్ బాధ్యులు బి.శివరామకృష్ణ , యోగేష్, జగన్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగుల పాట్లు



గుండె జబ్బుల వైద్యుడి కోసం వేచి ఉన్న రోగులు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో గుండె సంబంధిత వైద్య నిపుణులు రోగులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇక్కడ గుండెకు సంబంధించిన వైద్య నిపుణులు లేకపోవడంతో విశాఖ షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న గుండె వైద్య నిపుణుడు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రతి గురువారం చికిత్స అందించేలా ఒప్పందం జరిగింది. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు వైద్యుడు రావలసి ఉన్నప్పటికీ సాయంత్రం 4 గంటలకు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కొక్కసారి సాయంత్రం 5 గంటలకు కూడా వచ్చే పరిస్థితి ఉందని రోగులు చెబుతున్నారు. సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకుని సకాలంలో వైద్యం అందించాలని రోగులు కోరుతున్నారు.